# బ్యాంకల్లుడు

మంత్రవాది మహేశ్వర్

ఎప్పట్నుంచో తన కూతురు వెంకటలక్ష్మికి ఎన్నో సంబంధాలు చూస్తూనే వున్నాడు. చూసి వదిలేస్తూనే వున్నాడు కనకారావు.

కనకారావు యింటిపేరు పాపులర్ కావడంవల్లో, అమ్మాయి కనుముక్కు తీరు తనకున్నట్లు కాకుండా అందంగా వుండటంవల్లో, ఓ ఖరీదైన స్వంత భవంతి చింతలబస్తీలో వుండటంవల్లో పెళ్ళాం పేరుమీదా, తనపేరు మీదా, ఇద్దరిపేర్ల మీదా వున్న ఆస్తిపాస్తులవల్లో దేనివల్లో మొత్తానికి చాలామంది పెళ్ళికొడుకు తల్లితండ్రులు పెళ్ళికి రడీ అనేస్తున్నారు.

పెళ్ళికొడుకులు 'యస్' అని పాస్ పోర్టు సైజు ఫోటిచ్చేసి సిద్ధమైపోతున్నారు. ఇన్నేసి మంచి మంచి సంబంధాలు వస్తుంటే వదిలేస్తున్నారేమిటి అని ఆశ్చర్యంగా ముక్కుమీద వేలేసుకుని చూస్తోంది బంధువర్గం.

అమ్మాయి వెంకటలక్ష్మి అందంగానే వుంటుంది కనుక కట్నం గురించికూడా అవతలవాళ్ళు అంత పట్టింపు చూపక పోవటం నిజంగా కనకారావు పూర్వజన్మ సుకృతమనే చెప్పాలి.

"అందం ఏంచేసుకుంటాం. కొరుక్కు తింటామా" అని కట్నంపైన ఆశ చూపించేవాళ్ళు డజన్లకొద్దీ వున్న ఈ రోజుల్లో కనకారావులాంటి అదృష్టవంతుణ్ణి చూసి చాలామంది కుళ్ళారు కూడా.

అయినప్పటికీ వెంకటలక్ష్మి శ్రీమతి కావటంలేదు.


ఎందుకు?...దేనికి?

పోనీ పెళ్ళికూతురికి వాళ్ళు నచ్చక పోవడమా?

కొంపదీసి వెంకటలక్ష్మి తెలుగు సినిమా హీరోయిన్‌లా ఎవరినైనా లవ్వాడేసిందా. ఉహూఁ...అదేం కాదు.

కనకరావే 'యస్' అనటంలేదు

ఆయన స్నేహితుల అల్లుళ్ళు చాలా మంది బ్యాంకుల్లో పనిచేస్తున్నారట.




వాళ్ళింతో అన్యోన్యంగా కాపురం చేసుకుని పిల్లల్ని కంటున్నారట. వాళ్ళా విధంగా అన్యోన్యంగా వుండటానికి కారణం వాళ్ళు బ్యాంకుల్లో పనిచేయడమని తన నమ్మకం అందుకే తనకొచ్చే అల్లుడు బ్యాంకులో పనిచేస్తుండటం ప్రధాన క్వాలిఫికేషన్ అయి వుండాలట.

అబ్బాయి ఏజీ ఆఫీసని, సెక్రెటేరియట్ అని, పే అండ్ ఆడిట్ అని, పోస్టలని, పోర్టని, రైల్వే అని, సినిమా స్త్రీ పురుష ప్రొడ్యూసరని, సినిమాలు చూసే ఉత్తమ ప్రేక్షకుడని... ఇలా రకరకాల వృత్తులు చేపట్టిన అబ్బాయిలనేకం వచ్చారు. వచ్చిన ఆ అనేక మందిలో కొందరు అమ్మాయిని చూసి, మరికొందరు ఊహించి మొత్తానికి అంతా కుమారి వెంకటలక్ష్మికి రైట్ మార్క్ పెట్టారు కూడా.

ఎవరికోసం నేనాగను అన్నట్లు కాలం పరిగెట్టేస్తోంది.

అమ్మాయికి ఇరవైనాలుగు కూడా దాటేసింది.

"ఏమండీ అల్లుడు బుద్ధిమంతుడయి వుండాలి. అమ్మాయిని పోషించగలిగే ఉద్యోగస్తుడా కాదా అని చూడాలిగాని ఇదేం పట్టుదలండీ బాబు" అంది తనకా రావుతోనే పాతికేళ్ళ క్రిందట తాళి కట్టించుకున్న రాజ్యం.

"నీకు తెలియదు. నువ్వూరుకో... ఆఁ చూశాంగా ఓ పాతికమంది కుర్రవెధవల్ని వాళ్ళ ఉద్యోగాలని... ఓ ప్రమోషన్ వుండదు. గాడిదచాకిరీ బోడి ఇంక్రిమెంట్. అదే బ్యాంకుల్లో అయితే"

"మీరిలాగే బ్యాంకల్లుడో అంటూ కలలు కంటూ కూర్చోండి. అమ్మాయి

ముసల్దయిపోతుంది. మొన్నకి మొన్న ఆ పెంటపాడు సంబంధం బంగారం లాంటిది వద్దు పొమ్మన్నారు. కుర్రాడు చక్కగా వున్నాడు. పది హేను వందలకు పైనే తెచ్చుకుంటున్నాడు."

"నిజమే...కుర్రాడు బానే వున్నాడు. నేను కాదనలేదే...ఏడేళ్ళు ఏడిస్తే అదైనా వస్తోంది. అదే బ్యాంకులో అయితేనా చేరగానే వస్తుంది. ఆ-లోను ఈ-లోను అవకాశమున్న ప్రతిలోను పుచ్చుకుని ఓహో దర్జాగా బ్రతికేయొచ్చు"

విసిగెత్తిపోయింది రాజ్యానికి-"ఏమో బాబు మీ ఇష్టం వచ్చినట్లు ఏడవండి" వంటింట్లోకి పోయి గిన్నెలమీద చూపించింది తన ప్రతాపం.

"అర్నెల్లు తిరగకుండా బ్యాంకల్లుణ్ణి పట్టుకొస్తాను చూడు" అనేదో సినిమాలో హీరోలా లేకపోయినా హీరోలా అన్నాడు కనకారావు.

కనకారావుకు నాలుగైదు బ్యాంకుల్లో అకౌంట్ వుంది.

అయితే దురదృష్టవశాత్తూ వాటిలో పన్జేసేవాళ్ళు చాలామంది పెళ్ళిళ్లు ఒకసారి అయిపోయినవాళ్ళు, పెళ్ళిమీద చాలా దురభిప్రాయం వున్నవాళ్ళూ— ఒకరిద్దరు యువకులున్నారు. కానీ ఒకరు సిక్కు మతస్థులైతే, మరొకరు ముస్లిమ్. సమైక్యత గురించి రేడియోలో గంట గంటకూ వచ్చే ప్రసంగాలువిన్నా, డబ్బు తగలేసి కొనుక్కున్నాం అనుకునే టీవీలో పదేపదే ఆ కార్యక్రమాలు చూసినా అంతటి విశాలభావాలు తనకు లేవు కాబట్టి ఇంటూమార్క్- పెట్టేశాడు.

* * *

ఓ రోజు తన చిన్ననాటి స్నేహితుడితో ఓ బ్యాంక్‌కి వెళ్ళాల్సివచ్చింది. విశ్వాస్‌నగర్‌లో అదో చిన్న బ్రాంచ్.

'కల్పతరు'— టు బిల్డ్ యువర్ ఫ్యూచర్ నీడ్స్

'గృహకల్ప'-యువర్ డ్రీమ్ హౌస్ స్కీమ్- అని గోడకు తగిలించివున్న వాటికేసి చూస్తున్నాడు కనకారావు.

"ఒక్క-క్షణంలో ఎంటర్ చేసిస్తాను. మీకేమిటి డి.డి ఫారమ్... యిదిగో..." అంటున్న హుషారైన కంఠం కనకారావు దృష్టిని మరల్చేసింది.

కుర్రాడు మెరుపులా కనిపించాడు.

ఠపిగ్గా జవాబుచెప్పే విధానం—

చకచకా పని చేసుకుపోయే తీరు— నవ్వుతూ, నవ్విస్తూ పనిచేసుకుపోతున్నాడు ఆ అబ్బాయి. చాలా బాగా నచ్చాడు కనకారావుకి

ఆ విషయం ఫ్రెండు ప్రక్కనేవున్నా అనలేదు. ఆ ఛాన్స్ తన కూతురి మంచి దూరమై అతగాడి కూతురికి ఎక్కడ తగులుతుందో అనే శంక లేకపోలేదు.

తరువాత కొన్నిసార్లు ఆ బ్యాంకుకే వచ్చాడు కనకారావు— ఫ్రెండుతో కాదు.

అవసరం లేకపోయినా అకౌంట్ ఓపెన్ చేశాడు



వందరూపాయలు వేశాడు...ధూళై తీశాడు.

ఆర్‌డీ ఇంట్రెస్ట్ అడగడానికోసారి, ఎన్‌డీ గురించిన ఇన్‌ఫర్మేషన్ కోసం ఓసారి-యిలా ఎన్నోసార్లు- అలా వెళ్ళి 'అబ్బాయి'నే అడిగాడు. కొన్నింటికి జవాబిచ్చాడు. మరి కొన్నింటికి నవ్వేసి వెళ్ళిపోయాడు.

అసలే చిన్న బ్రాంచ్ కావడంతో 'అబ్బాయి' మరీ దృష్టిలో పడిపోయాడు.

అబ్బాయి- తనకు బాగా నచ్చాడు. తనకి నచ్చడంకాదు తన ఊరురికీ...

తప్పకుండా నచ్చుతాడు... నచ్చి తీరుతాడు.

'అబ్బాయి' అల్లుడైనట్టు ఓ డ్రీమ్-

* * *

"బ్యాంక్ ఆఫీసర్‌ను తీసుకొచ్చినవంత సంబరపడ్తారేం" అంది రాజ్యం.

"అవుతాడే ఈ రోజు క్లర్క్. మెరుపులాంటి కుర్రాడు. ఆఫీసర్ అతి త్వరలోనే అయిపోతాడు. మొదట్లోనే ఆఫీసరైతే ఆ నెమ్మదీ వుండదు."

"కనకారావు అంటే ఏమిటో తెలిసిందిగా" మీసం తీసేసిన విషయం గుర్తు లేక చేయిపోనిచ్చి గతుక్కుమన్నాడు.

నవ్వేసి లోపలికి వెళ్ళిపోయింది రాజ్యం.

* * *

పెళ్ళయిపోయింది.

పెళ్ళికూతురు నాయనమ్మ కోరిక ప్రకారం సందెపెంటలో పెళ్ళి జరిగిపోయింది. యిన్ని సంబంధాలు వచ్చిపోతున్నాయి పెళ్ళనేది అవుతుందా అని భయపడి నిద్రలేక విలపించిపోయిన వెంకటలక్ష్మికి చాలా సంతోషమేసింది. దాంతో సిగ్గుమొగ్గలై విడిపోయింది. మధ్యమధ్యలో పెళ్ళికొడుకేసి చూసింది కళ్ళతో మాట్లాడగలిగే ఎక్స్‌పీరియన్సు వున్న బ్యాంకల్లుడి మాటల్ని విని పోయిన సిగ్గును మళ్ళీ తెచ్చుకుని అతికించేసుకుంది.

పెళ్ళయిన రెండు మూడు నాలుగు రోజుల తరువాత శ్రీమతి వెంకటలక్ష్మి పెళ్ళికొడుకు అదే శ్రీవారి చొక్కా గుండీలు పెడుతూ అందంగా అదోలా పెక్సులక్ యిస్తూ "బ్యాంక్‌కు వెళ్ళాలా- ఓ వారం శలవు పెట్టకూడదూ" అంది.

"ఒక పదిహేను రోజులాగు ఎప్పుడూ యిలాగే..." అంటూ ఆమెను దగ్గరికి లాగేసుకున్నాడు అతికించేసుకున్నంతగా.

పదిహేను రోజుల తరువాత ఏమిటి? అని ఆలోచించని వెంకటలక్ష్మికి కనకారావుకి అందరికీ ఆ విషయం తెలిసే వరకి అలాగే వుండిపోయారు. నోట రాలేదు.

పెళ్ళికొడుకు బ్యాంకులో పనిచేస్తున్న మాట వాస్తవమేగానీ తామనుకుంటున్నట్టుగా క్లర్క్‌గా కాదు-మరి-ప్యూన్‌గా అందరికీ అన్నీ అందించే ఆ బ్యాంకు అల్లుడు కనకారావు లాకన్న గమనించి శలవుపెట్టిన ఏ సీనియర్ క్లర్క్ సీట్లోనో, కాఫీకెళ్ళిన జూనియర్ క్లర్క్ సీట్లోనో కూర్చోవడం యింత పని చేసింది.

బ్యాంకల్లుడే అయినా అదేమిటో కనకారావుకి చాలా బాధగా వుంది. కట్నం యిచ్చినా చెప్పుకోలేని యాభై వేలూ కళ్ళముందు కదులుతున్నాయి.

మరో నిజమూ కనకారావుకి తెలిసి జ్వరంతో మంచం ఎక్కాడు.

అదే—

ఆ బ్యాంకల్లుడు ప్యూన్‌గా చేయడం కూడా కాజ్యువల్‌గా ఓ లీవ్ వేకన్సీలో పని...

జ్వరం తగ్గాక కనకరావు తిరుగుతూనే వున్నాడు కొత్త చెప్పులేసుకుని.

అయితే అల్లుడికోసం కాదు- మెట్రిక్యులేషన్ మొన్ననే కష్టమ్మీద పూర్తి చేసిన అల్లుడికి ఏదో ఒకటిలే అనే 'వుద్యోగం' కోసం.

*